సాక్షి ఒడిశా

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 6,15,508
బంగారం	7 గ్రాములు
వెండి	25 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



నేటి నుంచే కాంగ్రెస్ పాదయాత్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర చేపట్టనుంది.

- 8లో▸



ఫకీర్ మోహన్ వర్సిటీకి నాక్ ఏ-గ్రేడ్

రాష్ట్ర ప్రభుత్వ విశ్వ విద్యాలయమైన బాలాసోర్ ఫకీర్ మోహన్ యూనివర్సిటీ (ఎఫ్ఎంయూ)కి నాక్ ఏ-గ్రేడ్ మంజూరు చేసింది. తామని వైస్ చాన్సలర్ సంతోష్ కుమార్ త్రిపాఠి తెలిపారు.

- 8లో▸

న్యూస్‌రీల్

విదేశీ మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లతో నిందితుడు

మల్కన్‌గిరి: విదేశీ మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కలిమెల సమితి గరమెట్ల గ్రామానికి చెందిన రామ మడ్కమి 27 లీటర్ల విదేశీ మద్యం బాటిళ్లను కలిమెల నుంచి అక్రమంగా గ్రామానికి తరలిస్తుండగా శనివారం రాత్రి పోలీసులకు చిక్కాడు. బ్యాగు తనిఖీ చేయగా మద్యం గుర్తించారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని మడ్కమిని అరెస్టు చేశారు. కేసు నమోసి చేసి సోమవారం కోర్టు లో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరస్తుడు అరెస్టు

బరంపురం: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అంతర్రాష్ట్ర సైబర్ నేరగాడిని బరంపురం పోలీసులు అరెస్టు చేశారు. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 8న డెబిట్‌కార్డు లావాదేవీలో రూ.95 వేలు మోసపోయినట్లు బరంపురం సైబర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐఐసీ ప్రశాంత్ భూపతి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. జార్ఖండ్ రాష్ట్రం దేవగడా జిల్లా కారగ్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాగద్రీ గ్రామానికి చెందిన మహమద్ అఫ్జల్ ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. ఆదివారం అఫ్జల్‌ను అరెస్టు చేశారు. రెండు మొబైల్ ఫోన్లు, రూ.95 వేలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

యువత శ్రమదానం



గోతులు కప్పుతున్న యువకులు

కొరాపుట్: అలమండ-పార్వతీపురం రహదారిలో సరిహద్దు ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు ఏర్పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో కొరాపుట్ జిల్లా బందుగాం సమితి అలమండ గ్రామానికి చెందిన యువకులు ఆదివారం శ్రమదానం చేశారు. కొరాపుట్ జిల్లా బీజేడీ యువజన విభాగ ఉపాధ్యక్షుడు దేవాసిస్ బెబొర్ (చింటు) ఆధ్వర్యంలో గోతులు పూడ్చారు.

చెరువులో మునిగి యువకుడి మృతి



రామ సికక మృతదేహం

రాయగడ: స్నానానికని చెరువులో దిగి ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన ఘటన కల్యాణసింగుపూర్ సమితి పర్కాలి పంచాయతీ ఫకేరి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామ సికక (27) ఎప్పట్లాగే స్నానం కోసం సమీపంలోని చెరువుకి వెళ్లాడు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాల కారణంగా నీరు ఎక్కువగా ఉంది. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సికకను బయటకు తీశారు. అప్పటికే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

152 కేజీల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎం.వి.72 గ్రామం వద్ద శనివారం పోలీసులు 152 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కలిమెల పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కారు అతివేగంగా రావడాన్ని గుర్తించారు. వాహనం ఆపి తనిఖీ చేయగా ఆరు బస్తాల్లో గంజాయి గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా అదే గ్రామానికి చెందిన సంజిత్ బిశ్వాస్‌గా గుర్తించారు. తెలంగాణకు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.10లక్షలు ఉంటుందని చెప్పారు.



రైలు పట్టాలపై కొండ చరియలు



ఘటనా స్థలానికి వెళ్తున్న రైల్వే సిబ్బంది

విరిగిన కొండచరియలు.. ఆగిన రైళ్లు

- కొత్తవలస-కిరండోల్ రైల్వేమార్గంలో స్తంభించిన రాకపోకలు
- ఈ నెల 29 వరకు పలు రైళ్లు రద్దు
- 18 జేసీబీలతో మట్టిని తొలగిస్తున్న సహాయక సిబ్బంది



పట్టాలపై పడిన రాళ్లు



కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

కొరాపుట్/జయపురం: ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తవలస-కిరండోల్ రైల్వేమార్గంలో కొండ చరియలు విరిగిపడటంతో రైళ్ల రాకపోకలు స్తంభించాయి. ఆదివారం వేకువజామున కొరాపుట్ రైల్వే స్టేషన్ సమీపంలో జరతి-మనబాల్ మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. కొండల పైనుంచి పెద్ద పెద్ద రాళ్లు, మట్టి దొర్లిపడటంతో జగదల్‌పూర్ వెళ్లాల్సిన పలు రైళ్లు కొరాపుట్‌లోనే నిలిచిపోయాయి. దాదాపు 10 రైళ్లు రద్దు చేశారు. కుండపోత వర్షాల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా గత నాలుగు రోజులుగా కిరండూల్-విశాఖపట్నం రైళ్లను రద్దు చేశారు. తాజాగా కొండచరియలు విరిగిపడటంతో ఈ నెల వరకు విశాఖపట్నం-కిరండూల్ 18514 నైట్ ఎక్స్‌ప్రెస్‌ను, కిరండూల్-విశాఖపట్నం 18513 నైట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. విశాఖపట్నం-కిరండూల్ 08551 పాసింజర్, కిరండూల్ - విశాఖపట్నం 08552 పాసింజర్‌ను ఈ నెల 29 వరకు రద్దు చేశారు. కాగా, కొండచరియలు, మట్టిని తొలగించేందుకు లక్ష్మీపూర్, కొరాపుట్‌ల నుంచి 18 జేసీబీలు తెప్పించారు. సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు.

భోజనం పెట్టమంటే బాదుతున్నారు!

- అన్వేష హాస్టల్ విద్యార్థుల ఆరోపణ
- జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు



సమస్యను వివరిస్తున్న అన్వేష హాస్టల్ విద్యార్థులు



నిర్వాహకులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రాయగడ: నాణ్యమైన ఆహారం పెట్టమంటే కొడుతున్నారని కొట్లాగుడ గ్రామంలో ఉన్న అన్వేష హాస్టల్ విద్యార్థులు ఆరోపించారు. ఈ మేరకు ఐదు కిలోమీటర్లు కాలినడకన నడిచివచ్చి రాయగడ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అదనపు కలక్టర్ రామేశ్వర్ ప్రధాన్‌ను కలిసి సమస్య వివరించారు. కొట్లాగుడలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఎస్సీ, ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో అన్వేష హాస్టల్ నడుపుతున్నారు. ఇందులోని ఒకటో వార్డులో 25 మంది విద్యార్థులు తమకు నాణ్యమైన ఆహారం ఇవ్వడం లేదని చెబుతున్నారు. వారానికి రెండు రోజులు ఇవ్వాల్సిన మాంసాహారం కూడా సరిగ్గా పెట్టడం లేదని, ఇదేంటని ప్రశ్నిస్తే కొడుతున్నారని ఆరోపించారు. సూపరింటెండెంట్ విశ్వనాథ్ సునా తమపై కఠినంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఆయన విధులకు కూడా సరిగ్గా హాజరు కావడం లేదని, వేరే వ్యక్తి బాధ్యతలు చూస్తుంటాని విన్నవించుకున్నారు.

హాస్టల్‌ను సందర్శించిన బీజేపీ నేతలు..

విద్యార్థుల ఆరోపణల నేపథ్యంలో వాస్తవాలు తెలుసుకునేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివ కుమార్ పట్నాయక్, ఎస్సీ, ఎస్టీ మోర్చా రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, ఆదివాసీ నాయకుడు ప్రతాప్ పువ్వల తదితర నాయకులు ఆదివారం హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు దీనావస్థలో ఉన్నారని, సరైన ఆహార, వసతులు కల్పించడం లేదని తమ పరిశీలనలో వెల్లడైందని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

ముందుగా గుర్తిస్తే ముప్పు తప్పినట్లే



గర్భాశయ కేన్సరు నివారణ చర్యలను వివరిస్తున్న వైద్య నిపుణులు

- కేన్సర్ అవగాహన శిబిరంలో వక్తలు



మాట్లాడుతున్న డాక్టర్ నితీష్ రంజన్ ఆచార్య

భువనేశ్వర్: కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని వక్తలు పేర్కొన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) భువనేశ్వర్ క్యాంపస్‌లో కటక్ హెచ్‌సీజీ పండా కేన్సర్ ఆస్పత్రి సహకారంతో కేన్సర్ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నితీష్ రంజన్ ఆచార్య మాట్లాడుతూ ప్రారంభ దశలో కేన్సరు గుర్తింపు కీలకమన్నారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార కేన్సరు నివారణలో హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సిన్‌లు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అనంతరం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఐటీ క్యాంపస్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మన్సూర్ అహ్మద్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురు అరెస్టు

జయపురం: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. గాంధీ కూడలి, కెనాల్ రోడ్డు, ఎస్‌కేటీ రోడ్డు, పవర్ హౌస్, సూర్యమహల్ స్ట్రీట్ ప్రాంతాల్లో జయపురం పోలీసులు శనివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న ఆరుగురిని పట్టుకున్నారు. ఈ దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్లు సంజీవి మహంతి, నవీన్ చంద్ర చౌధురి, ఏఎస్ఐలు రమేష్‌కుమార్ మహాపాత్రో, అనిల్ కుమార్ నాయిక్, బిష్ణు మడకామి ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సదస్సులో పాల్గొన్న మహిళా న్యాయవాదులు, విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రవాసిని నాయక్

రాయగడ: సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఒడిశా ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ లాయర్ (ఓఎఫ్‌డబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రవాసిని నాయక్ అన్నారు. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఆదివారం రాయగడ బార్ అసోసియేషన్ మహిళా లాయర్ల వింగ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ ఎగినెస్ట్ ఉమెన్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు పెరగడం ఆనందించాల్సిన విషయమే అయినప్పటికీ సైబర్ నేరాలు సైతం అదే స్థాయిలో పెరుగుతున్న అంశం గుర్తించాలన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలపై సరైన అవగాహన లేక ఎంతోమంది మోసపోతున్నారని చెప్పారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. రాయగడ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చనా పట్నాయక్, డాక్టర్ డి.కె.మొహంతి, న్యాయవాది ఉమా అయ్యర్, రాయగడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బ్రజసుందర్ నాయక్ తదితరులు సైబర్ నేరాలు, చట్టాలను వివరించారు. న్యాయవాది ప్రణతి పాత్రో అధ్యక్షతన, ఓఎఫ్‌డబ్ల్యూ సౌత్ జోన్ ఉపాధ్యక్షురాలు సుభ్రా పండా నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో కళాశాలల విద్యార్థులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

జగబంధు సేవలు చిరస్మరణీయం



స్మారక స్థూపం వద్ద జగబంధు, ప్రశాంత్ చిత్రపటాలు

కొరాపుట్: మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ ఎమ్మెల్యే జగబంధు మజ్జి సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. 2011 సెప్టెంబర్ 24న జగబంధును రాయిఘర్ సమితి గుణ వద్ద వారపు సంతలో మావోయిస్టులు కాల్చిచంపారు. ఆ సమయంలో అతని గన్‌మేన్ కొసాగుమ్డాకు చెందిన ప్రశాంత్ కుమార్ పాత్రోని సైతం కాల్చి చంపారు. వీరి సంస్మరణార్థం గుణలో ఆదివారం సంతాప సభ ఏర్పాటు చేశారు. నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి హాజరై జగబంధు సేవలు కొనియాడారు. ప్రశాంత్ సేవలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మర్‌కోట్ మాజీ ఎమ్మెల్యే సుభాష్ గోండో, అతని సతీమణి రాయిఘర్ సమితి చైర్‌పర్సన్ నవీనా గోండో, దళిత్ సమాజ్ నాయకులు, బిజూ జనతాదల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు చేయూత



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మహంతి

జయపురం: ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలి నిరాశ్రయులైన బాధితులకు రెడ్‌క్రాస్ నిధి నుంచి సాయం అందించినట్లు జయపురం మున్సిపల్ చైర్‌పర్సన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో 17 ఇళ్లు కూలిపోయాయని చెప్పారు. వీరికి రెడ్‌క్రాస్ నిధి నుంచి ఆర్థిక సహాయం అందజేయాలని కొరాపుట్ జిల్లా కలెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.2500 చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు.

పూరీ-రౌర్కెలా..

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



విద్యార్థులతో కలిసి ప్రయాణిస్తున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



వీడియో కాన్ఫరెన్సులో తిలకిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుసేవలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో 20836 డౌన్, 20835 అప్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవల్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమం తిలకించారు. ఈ రైలు శనివారం మినహా మిగిలిన రోజుల్లో నిత్యం పూరీ - రౌర్కెలా మధ్య నడుస్తుంది. వందేభారత్ రైళ్లు ఒడిశాతో సహా 11 రాష్ట్రాల్లోని మతపరమైన, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను అనుసంధానపరుస్తాయి. వందే భారత్ సెమీ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సంఖ్య 34కి చేరింది. స్థానిక రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, కేంద్ర విద్య, నైపుణ్య అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ రైలు ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, ఢెంకనాల్, తాల్చేర్ రోడ్, అంగుల్, రైరాఖోల్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగుడ స్టేషన్లలో ఆగుతుంది. ఈ నెల 27వ నుంచి పూరీ - రౌర్కెలా మధ్య రెండు వైపులా నడుస్తుంది. ప్రారంభోత్సవం సందర్భంగా భువనేశ్వర్ రైల్వే స్టేషను నుంచి మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో బయల్దేరింది. పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించారు. వీరితో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముచ్చటిస్తూ అంగుల్ స్టేషను వరకు ప్రయాణించారు.



భువనేశ్వర్ రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

క్లుప్తంగా

వంతెన పైనుంచి కారు బోల్తా



నుజ్జయిన కారు

భువనేశ్వర్: స్థానిక బొమిఖల్ వంతెనపై దూసుకుపోతున్న ఓ కారు ప్రమాదవశాత్తు కిందకు జారిపడింది. ఈ ఘటనలో గాయపడిన డ్రైవర్ ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కారు నుజ్జునుజ్జయ్యింది.

'రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాలి'



రాకెట్‌ను అందజేస్తున్న సూర శ్రీను, కృష్ణంరాజు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటి విజేతలై జిల్లాకు తిరిగిరావాలని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు(తృప్తి రిస్టార్స్‌మురళీ) క్రీడాకారులకు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకాకుళం బాల్ బ్యాడ్మింటన్ మైదానంలో ఆదివారం సబ్–జూనియర్ బాల, బాలికల శిక్షణ శిబిరాన్ని ఎచ్చెర్ల బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షుడు, సంఘ సేవకులు సూర శ్రీనివాసరావుతో కలిసి కృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడగా ఎంతో గుర్తింపు కలిగిన బాల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న క్రీడాకారులందరూ నిరుపేద పిల్లలేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులకు రైల్వే రాయితీలను నిలుపుదల చేయడంతో వారిపై మరింత ఆర్థిక భారం పడుతుందన్నారు. వీరిని ప్రోత్సహించడానికి శ్రీకాకుళం బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కోత పూర్ణచంద్రరావు, ఎన్ఈఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి ఎన్.ఈశ్వరరావు, ఎచ్చెర్ల బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షుడు సూర శ్రీనివాసరావు, కనకదుర్గ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్(టెక్కలి), పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు, ముందుకు వస్తుండటం శుభపరిణామమని వారు సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సూర శ్రీను జిల్లా జట్లకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసి తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు.

30 నుంచి నంద్యాలలో రాష్ట్రపోటీలు..

కర్నూలు జిల్లా నంద్యాల మహానంది దేవస్థానం మైదానంలో సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 2 వరకు ఏపీ రాష్ట్రస్థాయి సబ్–జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే శ్రీకాకుళం జిల్లా తుది జట్లను సంఘ బాధ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి బీహెచ్ అరుణకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి పి.అజయ్‌కుమార్, ఎల్.వి.రమణ, శిక్షకులు పి. రాజ్‌కుమార్, ఎం.మధుసూదనరావు, పి.పవన్‌కుమార్, చిరంజీవి, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

జిల్లా బాలుర జట్టు: శిష్టు హిమత్ కుమార్, నర్సీపురం ప్రవీణ్ కుమార్, లబ్బ మణికంఠ, గొంటి నవీన్ కుమార్, గూడిపూడి చాయాకిరణ్, వాకమూరి యోగి, వెంపాడ సురేష్ రెడ్డి, పొన్నాడ జితేంద్ర, ఎర్ర మదన్, పట్టీసపు నిషాన్త్.

జిల్లా బాలికల జట్టు: ముంత గాయత్రి, సింగూరు నందిని, బెందు జోత్స్న, సంబంగి వినూత్న, శిష్టు ప్రియమణి, రామ భువనేశ్వరి, ఉంగటి పావని, చల్లా శ్రావణి, పోరాం భువనకృతి ఎంపికైనవారిలో ఉన్నారు.

'విద్యార్థుల్లో సేవా దృక్పథం అవసరం'

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో సేవా దృక్పథం అవసరమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ఎస్ఎంపురం క్యాంపస్‌లో ఆదివారం జాతీయ సేవాపథకం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ట్రిపుల్ ఐటీలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజ ప్రయోజక కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్ బాబు, డాక్టర్ వి.సింహాచలం, డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి'

పలాస/కాశీబుగ్గ: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఫార్మసిస్టులు డాక్టర్లతో కలిపి కృషి చేస్తున్నారని ఫార్మసిస్టు సంఘ జిల్లా నాయకులు బోనేల గోపాల్ అన్నారు. ఆయన ఆదివారం పలాసలో విలేకరులతో మాట్లాడారు. డ్రగ్ డిస్పెన్సింగ్, వ్యాక్సినేషన్, కమ్యూనికేబుల్, నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్, కుటుంబ నియంత్రణ వివిధ రకాల శాఖల్లో అమూల్యమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. కోవిడ్ వంటి ఆపత్కాలంలో ఫార్మసిస్టులు చేసిన సేవ నిరుపమానమని అన్నారు.

నేటి నుంచే కాంగ్రెస్ పాదయాత్ర



కాంగ్రెస్ పాదయాత్ర కరపత్రం ఆవిష్కరించిన ఓపీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్

- రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం
- ఇంటింటా ప్రచారం

భువనేశ్వర్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీల వ్యూహాలకు పదును పెడుతున్నాయి. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల్ని బాహాటంగా ఎండగట్టేందుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నడుం బిగించింది. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికి వెళ్లేందుకు పాదయాత్రకు సిద్ధమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల్ని ప్రచారం చేసి ప్రజల్ని చైతన్యం చేయడమే తమ లక్ష్యమని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెసు భవన్‌లో పాదయాత్ర ప్రచార కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రారంభమవుతున్న పాదయాత్ర అక్టోబర్ 15 వరకు నిరవధికంగా కొనసాగుతుందన్నారు. బిజూ జనతా దళ్ (బీజేడీ) 24 ఏళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. గత 9 ఏళ్లలో కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ పనితీరు కూడా దుర్భరంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై సవివరంగా వివరించే ప్రచారపత్రంతో ప్రజలను కలుస్తామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీల్ని అమలు చేయడంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విఫలమయ్యారని పీసీసీ చైర్మన్ ఆరోపించారు. ఏటా 2 లక్షల ఉద్యోగాలు, ఒక్కో మండలానికి 45 శాతం సాగునీరు, అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, సామాజిక భద్రత, రెండింతల రైతుల ఆదాయం, మహిళలకు రక్షణ కల్పిస్తామన్న హామీలు కాగితాల్లో రాతలుగా మిగిలిపోయాయని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురైందని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయని శరత్ పట్నాయక్ పేర్కొన్నారు. దేశంలోని రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులకు బీజేపీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం కేంద్రంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం భారీ ప్రగతిని సాధించిందని గుర్తు చేశారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేసే ఏకైక రాజకీయ పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి



మాట్లాడుతున్న ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్

రాయగడ : సమాజ శ్రేయస్సుకు పత్రికలు కృషి చేయాలని జిల్లా అదనపు కలక్టర్ రామేశ్వర్ ప్రధాన్ అన్నారు. స్థానిక తేజశ్వి హోటల్లో ఆదివారం ఒడిశా మీడియా జర్నలిస్టుల సంఘం ఏడో వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత్రికేయ వృత్తి గౌరవప్రదమైనదన్నారు. సమస్యలు వెలికితీసి వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. ప్రజలకు అధికారులకు వారధిలా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాయగడ వంటి జిల్లాల్లో అత్యధికంగా ఆదివాసీలు నివాసముంటున్నారని, వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు పత్రికలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. అనంతరం సంఘ కార్యదర్శి మనోజ్‌కుమార్ సాహు వార్షిక నివేదికను వివరించారు. పలువురు పాత్రికేయులను, సమాజసేవకులను సత్కరించారు. కార్యక్రమంలో రాయగడ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కె.గంతాయిత్, జిల్లా పౌరసంబంధాల అధికారి బసంత కుమార్ ప్రధాన్, న్యాయవాది ప్రదీప్‌కుమార్ దాస్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి



కాళిదాస్ చటర్జీ మృతదేహం

మల్కన్‌గిరి: బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కదబహల్ గ్రామం సమీపంలో జుగాల్ కీర్తనీయ వద్ద రోజు కూలీగా పని చేస్తున్న కాళిదాస్ చటర్జీ (42) శనివారం రాత్రి పని పూర్తి చేసుకుని స్వగ్రామానికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఆ సమయంలో గూరపల్లి నుంచి మల్కన్‌గిరి వైపు బైక్‌పై వస్తున్న ముక్క మాడ్కమి, హరి మాడ్కమిలు ఎం.వి.8 గ్రామం వద్ద అతివేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కిందపడి గాయపడిన ముగ్గురినీ స్థానికులు మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే కాళీదాస్ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికీ చికిత్స అందించారు. మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బాలముకుంద కేంద్రంలో రాధాష్టమి



చిన్నారులతో నిర్వాహకులు

పర్లాకిమిడి: రాసూరు గ్రామంలో జగన్నాథ నికేతన్ అనాథాశ్రమంలో ఆదివారం రాధాష్టమి నిర్వహించారు. రచయిత అత్తిబడి జగన్నాథదాస్ చరిత్రను, రాధాష్టమి ప్రాముఖ్యతను నిత్యానంద చౌదురి వివరించారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వేళలివే..



భువనేశ్వర్ నుంచి ప్రారంభమైన రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

భువనేశ్వర్: పూరీ – రౌర్కెలా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ 20836 డౌన్ రైలు పూరీ నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు రౌర్కెలా చేరుతుంది. ఈ రెండు స్టేషన్ల మధ్య 505 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి 7 గంటల 45 నిమిషాలు పడుతుంది. తిరుగు ప్రయాణంలో 20835 అప్ రైలు రౌర్కెలా నుంచి మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.40 గంటలకు పూరీ చేరుతుంది. శనివారం మినహా వారానికి ఆరు రోజులు నిత్యం రాకపోకలు చేస్తుంది. ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, ఢెంకనాల్, తాల్చేర్ రోడ్, అంగుల్, రైరాఖోల్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగుడ స్టేషన్లో ఆగుతుంది.

20836 డౌన్ రాక / పోక	స్టేషన్	20835 అప్ రాక / పోక
-- / 05.00	పూరీ	21.40 / --
05.35 / 05.40	ఖుర్దారోడ్	21.05 / 21.07
06.00 / 06.05	భువనేశ్వర్	20.40 / 20.45
06.30 / 06.32	కటక్	20.10 / 20.12
07.24 / 07.26	ఢెంకనాల్	18.45 / 18.47
08.04 / 08.06	తాల్చేరు రోడ్	18.13 / 18.15
08.14 / 08.16	అంగుల్	18.00 / 18.02
09.25 / 09.27	రైరఖోల్	17.03 / 17.05
10.05 / 10.10	సంబల్‌పూర్ సిటీ	16.10 / 16.15
11.13 / 11.15	ఝార్సుగుడ	15.28 / 15.30
12.45 / --	రౌర్కెలా	-- / 14.10

వన్యప్రాణుల సమస్యలపై సమీక్ష

భువనేశ్వర్: సత్కోసియా టైగర్ రిజర్వ్‌లోని పక్షుల సర్వేకు సంబంధించి అటవీ, పర్యావరణం, వాతావరణ మార్పుల శాఖ మంత్రి ప్రదీప్ కుమార్ అమత్, ఒడిశా శాసనసభ డిప్యూటీ స్పీకర్ రజనీకాంత్ సింగ్ సమీక్షించారు. అంగుల్ జిల్లాలో అటవీ శాఖ పనులు, మానవ–వన్యప్రాణుల సంఘర్షణ సమస్యలపై చర్చించారు.

'విద్యా విధానంలో మార్పులు గమనించాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత విద్యా విధానం అమలులో అనేక మార్పులు వస్తున్నాయని, ఈ మార్పులు గమనించి విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎస్ఎం పురం క్యాంపస్‌లో ఆదివారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానం అమలు తర్వాత ఇంజినీరింగ్ విద్యలో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. థియరీ, ప్రాక్టికల్స్, ఇంటర్న్‌షిప్‌లు పక్కాగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులు రిలీవ్ నాటికి మంచి ప్యాకేజీలతో ఉద్యోగం సాధిస్తున్నారని అన్నారు. మరో పక్క ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో సైతం సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రతిభ గల విద్యార్థులు చేరుతున్నారని అన్నారు. వారిలో నైపుణ్యాలు వెలికి తీసి ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు. అనంతరం వర్సిటీలో నిర్మాణాలు, అకడమిక్ వ్యవహారాలు, వసతి గృహం నిర్వహణ వంటివాటిపై సమీక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన కృష్ణ, రిసోర్సు పర్సన్లు ప్రొఫెసర్ డి. హరినారాయణ, ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఆసక్తిగా రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

రణస్థలం: మండలంలోని ఎన్ఈఆర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కూల్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి పాఠశాలల ర్యాంకింగ్ చదరంగం పోటీలు ఆసక్తిగా సాగాయి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఆత్మస్థైర్యం పెరుగుతుందని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీవీ శర్మ, ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎన్. ఈశ్వరరావులు తెలిపారు. రాష్ట్రంలోని 60 స్కూల్స్ నుంచి 200 మంది క్రీడాకారులు తరలివచ్చారు. ఇందులో ఇంటర్నేషల్ రేటెడ్, స్టేట్ లెవెల్, వర్ధమాన క్రీడాకారులు ఉన్నారు. ఐదు రౌండ్ల పాటు సాగిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల క్రీడాకారులు నువ్వా–నేనా అన్నట్లు హోరాహోరీగా తలపడ్డారు. వివిధ కేటగిరీల్లో ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయి పాఠశాలల చదరంగం పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ప్రతి కేటగిరీ నుంచి పదిమంది చొప్పున 60 మంది క్రీడాకారులు ర్యాంకింగ్ పొందారు. అండర్–12 కేటగిరీలో శ్రీకాకుళం పాఠశాలకు తోట భాంధ్విక ద్వితీయ స్థానం రాగా, ఎన్ఈఆర్ స్కూల్ నుంచి మూడో స్థానంలో లక్ష్మీ ప్రణవి అండర్–10 కేటగిరిలో ఎంపికైంది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తేజ, రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు, కోశాధికారి జ్యోలాముఖి, సీనియర్ నేషనల్ అర్బిటర్ చలపతిరావు, సీనియర్ కోచ్ అభినవ్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

పోటెత్తిన భక్తజనం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. అంతరాలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తులకు ఉచిత మంచినీరు, ఉచిత వైద్య సదుపాయాలతో పాటు ఉచిత ప్రసాదాలను కూడా ఈఓ వి.హరిసూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశా రు. కొత్తగా రూ.300తో ఆలయ మండపాల్లోని సూర్యనమస్కార పూజలకు ఎగ్జిట్ ద్వారం నుంచి ప్రత్యేకంగా అనుమతివ్వడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు కుటుంబసమేతంగా ఆదివారం ఉదయం ఆదిత్యుడిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ వి.హరి సూర్యప్రకాష్, ప్రధానార్చకులు శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా సమగ్రశిక్ష జీసీడీఓ కర్రి రోజారమణి కుటుంబ సమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఇక ఆదివారం నాడు దర్శనాల టిక్కెట్ల రూపంలో రూ.1,13,100, విరాళాలు ఆర్జిత సేవల రూపంలో రూ.62,621, ప్రసాదాల విక్రయాలతో రూ.1.50 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు.

ఫకీర్ మోహన్ వర్సిటీకి నాక్ ఏ–గ్రేడ్



ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ విశ్వ విద్యాలయమైన బాలాసోర్ ఫకీర్ మోహన్ యూనివర్సిటీ (ఎఫ్ఎంయూ)కి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) ఏ–గ్రేడ్ మంజూరు చేసింది. రెండో విడత అసెస్‌మెంట్‌లో వర్సిటీ ఏ గ్రేడ్ సొంతం చేసుకుంది. నాలుగింట 3.18 గ్రేడ్ పాయింట్లతో ఇది సాధ్యమైంది. ఇప్పటివరకు ఉన్నత విద్యా శాఖ ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా అత్యధిక జీపీఏ సాధించిన సంస్థగా ఎఫ్ఎంయూ ప్రత్యేకత చాటుకుంది.

పాయింట్లు ఇలా..

నాక్ సర్టిఫికెట్ ప్రకారం, ఎఫ్ఎంయూలో కరిక్యులర్ అంశాలకు 3.2 గ్రేడ్ పాయింట్లు, బోధన అభ్యాసం, మూల్యాంకనానికి 3.43, పరిశోధన, ఆవిష్కరణలు, విస్తరణకు 2.44, మౌలిక సదుపాయాలు, అభ్యాస వనరులకు 3.65, విద్యార్థుల ప్రోత్సాహం, పురోగతికి 3.67, పాలన దక్షతకు 2.98 గ్రేడ్ పాయింట్లు వచ్చాయి. నిర్వహణ, సంస్థాగత విలువలు, ఉత్తమ అభ్యాసాలకు 3.78 పాయింట్లు దక్కాయి. సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు ఎఫ్ఎంయూ క్యాంపస్‌ను సందర్శించింది.

మరింత ఉన్నతికి కృషి..

రెండో విడతలో 3.18 గ్రేడ్ పాయింట్లతో సాధించిన ఏ గ్రేడ్‌ను కొనసాగించేందుకు నిరంతరం కృషి చేస్తామని, భవిష్యత్తులో మరింత ఉన్నతి సాధించేందుకు చర్యలు చేపడతామని వైస్ చాన్సలర్ సంతోష్ కుమార్ త్రిపాఠి తెలిపారు.

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా ఉండండి



సైక్లింగ్ క్లబ్ సభ్యులు

జయపురం: ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ సైకిల్ తొక్కాలని జయపురం సైక్లింగ్ క్లబ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం జయపురం సమితి దిగాపూర్‌లో ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైక్లింగ్ వల్ల కలిగే లాభాలు, పర్యావరణ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. సాధ్యమైనంత వరకు సైకిల్ ప్రయాణం అలవాటు చేసుకుంటే ఆరోగ్యానికి మేలు కలుగుతుందన్నారు. అనంతరం ఒక చెట్టు, ఒక బిడ్డ నినాదాలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఆర్గనైజర్ కిల్లంశెట్టి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది బాలకార్మికులకు విముక్తి

మల్కన్‌గిరి: జిల్లాలో పొడియా సమితి ఎం.56 గ్రామంలో ఓ ఇంట్లో పనిచేస్తున్న తొమ్మిది మంది బాలకార్మికులను ఆదివారం జిల్లా శిశు సంరక్షణ అధికారులు రక్షించారు. రోజు కూలీ పేరిట ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా బస్తానార్ గ్రామం నుంచి తొమ్మిది మంది మైనర్లకు ఓ కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణ పని కోసం తీసుకువచ్చి ఓ ఇంట్లో ఉంచాడు. విషయం తెలుసుకున్న జిల్లా శిశు సంరక్షణ అధికారి నారాయన్‌దాస్ ఆదివారం ఆ ఇంట్లో తనిఖీలు చేపట్టి బాలలకు విముక్తి కల్పించారు. అక్కడి నుంచి మల్కన్‌గిరి తీసుకొచ్చారు. అనంతరం దంతెవాడ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో చర్చించి అక్కడికి పంపే ఏర్పాట్లు చేశారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్



మూగజీవులను రక్షిస్తున్న బృందం



రక్షణ పరికరాలు పరిశీలిస్తున్న అగ్నిమాపక బృందం

బరంపురం : జిల్లాలోని ఛత్రపూర్ పట్టణంలో ప్రకృతి వైపరీత్యాలపై నిర్వహించిన మాక్‌డ్రిల్ ఆకట్టుకుంది. మల్టీపర్పజ్–సైక్లోన్ షెల్టర్ ప్రాంగణంలో బరంపురం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకృతి విపత్తులను ఏ విధం ఎదుర్కోవాలో, ప్రమాదాల నుంచి ఎలా రక్షణ పొందవచ్చో వివరించారు. వీటిని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, సిబ్బంది పాల్గొన్నారు.

జయజయ శుభకర వినాయక



రెండో దైనిక బజారు వీధిలో..



చలానగుడలో గణపతి


జయపురంలో గణనాథుని నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక ప్రసాదరావుపేటలో 50 ఏళ్ల ఆనవాయితీని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా ఘనంగా పూజలు నిర్వహించారు. భద్రయ్య వీధి, చలానగుడ, ఫారెస్టు కాలనీ తదితర ప్రాంతాల్లోనూ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. – జయపురం



ప్రసాదరావుపేటలో పూజలందుకుంటున్న వినాయకుడు



ఫారెస్టు కాలనీలో..



జయపురం భద్రయ్య వీధిలో..



ఎన్.కె.టి రోడ్డులో..

క్లుప్తంగా

పిడుగుపాటుకు గురై మహిళకు తీవ్ర అస్వస్థత



పిడుగుపాటుకు గురైన మహిళను 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

తెర్లాం: తెర్లాం మండలం, నందబలగ గ్రామానికి చెందిన గుల్లిపల్లి సావిత్రి పొలంలో పనిచేస్తుండగా పిడుగు పడడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆదివారం మధ్యాహ్నం ఆమె పొలంలో పనిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో దగ్గరలో పిడుగు పడడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. పక్కనే పొలం పనులు చేస్తున్న కొంతమంది వచ్చి చూసి 108 వాహనానికి సమాచారం అందించగా ఈఎంటీ బోను వెంకటరమణ, పైలట్ అమరా రాజేష్ హుటాహుటిన వాహనంతో వచ్చి పిడుగుపాటుకు గురైన మహిళకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యసేవల నిమిత్తం బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు.

వేడుకగా సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

విజయనగరం టౌన్: స్థానిక పద్మావతినగర్‌లో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు శివ, కార్యదర్శి శ్రీరామ్‌ల నేతృత్వంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుమారు 200 మంది చిన్నారులు అక్షరాభ్యాసంలో పాల్గొనడం విశేషమని నిర్వాహకులు ఈ సందర్భంగా సంతృప్తి వెలిబుచ్చారు. చిన్నారులకు కావాల్సిన సామగ్రిని ఉచితంగా అసోసియేషన్ పంపిణీ చేసింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తరించారు.

ఫొటోఫ్రేమ్ షాపు దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: స్థానిక వైష్ణవ వీధిలో గల వైష్ణవి ఫొటోఫ్రేమ్ వర్కింగ్ షాపు ఆదివారం వేకువజామున అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. షాపులో వెంటిలేషన్ లేకపోవడంతో అగ్నిమాపక శాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో సుమారు రూ. 9 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించిందని అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి వి.సోమేశ్వర రావు తెలిపారు.

పిడుగుపాటుతో 11 గొర్రెల మృతి



పిడుగుపాటుకు గురై మృతి చెందిన గొర్రెలు

మక్కువ: మండలంలోని విజయరామపురం గ్రామ సమీపంలో మేత మేస్తున్న 11 గొర్రెలు పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గొర్రెల మంద మేత మేస్తుండగా ఒక్కసారిగా పిడుగుపడింది. దీంతో అక్కడికక్కడే 11 మేకలు మృతి చెందాయి. ఈ విషయంలో అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోన గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు వెంకటరమణ, సత్యం కోరుతున్నారు.

పామాయిల్ సాగుకు ప్రోత్సాహం

- 2023-24లో 4800 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెంపు
- ఇప్పటికే 17,500 ఎకరాల్లో సాగు
- రైతు నాటిన మొక్కలకు రాయితీలు

పార్వతీపురం మన్యం జిల్లాలో పామాయిల్ సాగు	
సాగవుతున్న విస్తీర్ణం	17,500 ఎకరాలు
ఈ ఏడాది విస్తరణ	4,800 ఎకరాలు
మొక్కలు నాటిన విస్తీర్ణం	625 ఎకరాలు
మొక్కలు నాటిన రైతులు	1,000 మంది
నాటేందుకు సిద్ధం చేసిన విస్తీర్ణం	1175 ఎకరాలు
పామాయిల్ నాటాల్సిన విస్తీర్ణం	3,500 ఎకరాలు



పామాయిల్ మొక్కల నర్సరీలో ఉద్యాన వన శాఖాధికారులు



పార్వతీపురం సమీపంలో విస్తరించిన తోటలు



రైతు నాటిన హైబ్రిడ్ మొక్కలు

భామిని: జిల్లాలో ఆసక్తి గల రైతులను గుర్తించి పామాయిల్ సాగుకు ఉద్యాన వన శాఖాధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఈ మేరకు రైతు భరోసా కేంద్రాలను అనుసంధానిస్తూ రైతుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేశారు. జిల్లాలో పామాయిల్ తోటల పెంపకానికి అనువుగా గల ప్రాంతాలను ఎంపిక చేసి రాయితీలతో మొక్కలు అందిస్తున్నారు. ఇప్పటికే సొంతంగా మొక్కలు నాటిన రైతులకు ప్రోత్సాహక రాయితీలు అందించే కార్యాచరణ చేపట్టినట్లు హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.

మొక్కలు నాటిన తోటలకు ఎకరాకి రూ.10వేల మేరకు రాయితీ అందిస్తున్నారు. స్థానిక రకాలు కాకుండా విదేశాల నుంచి తెచ్చే హైబ్రిడ్ రకాలకు కూడా రాయితీలు అందజేస్తూ సాగు విస్తీర్ణం పెంచుతున్నారు. నేరుగా రైతులు ఆర్‌బీకేలను సంప్రదించి పామాయిల్ సాగుకు ఆసక్తి చూపితే. ఎకరాకి రూ.40 వేల వరకు సబ్సిడీ చెల్లిస్తున్నారు.మూడేళ్లలో పంటను పరిశీలించి మూడు విడతలుగా రాయితీ అందిస్తారు. ఆదాయం పెంచేందుకు అంతర పంటగా కోకో లాంటి సాగును ప్రేరేపించి రైతును సిద్ధం చేస్తున్నారు.

ఈ ఏడాది లక్ష్యం..

2023-24లో జిల్లాలో ఇప్పటికే సాగు చేస్తున్న 17,500 ఎకరాలకు తోడు మరో 4800 ఎకరాల్లో పామాయిల్ తోటల పెంపకానికి రైతులను అధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా 625 ఎకరాల్లో పామాయిల్ మొక్కలు నాటించారు. మరో వెయ్యి మంది రైతులను గుర్తించి మొక్కలు వేయడానికి సిద్ధం చేశారు. ఇందుకోసం కురుపాం, గరివిడి, రాజాంలలోని పామాయిల్ ఆయల్ మిల్లు యాజమాన్యాలకు మొక్కలను సిద్ధం చేసే బాధ్యత అప్పగించారు. ఈ మేరకు చిన్న మంగళాపురం, మల్లిభద్ర, గరివిడిలలోని నర్సరీలలో మొక్కలు సిద్ధం చేయిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని సంప్రదించి మలేషియా దేశానికి చెందిన హైబ్రిడ్ రకాల మొక్కల తెప్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

రసీదు చూపిస్తే రాయితీ..



పామాయిల్ తోటలు వేసిన రైతులు ఆర్‌బీకేల ద్వారా దరఖాస్తు చేసినా.. మొక్కలు తెప్పించిన చోట నుంచి రసీదులు సమర్పించినా రాయితీలు వర్తిస్తాయి. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

పేడాడ జయశ్రీ, హెచ్‌టీఓ, పెద్దదిమిలి, భామిని మండలం

రాయితీల పెంపు



జిల్లాలో ఆయిల్ పామ్ సాగును పార్వతీపురం ఐటీడీఏ పరిధితో పాటు సీతంపేట ఐటీడీఏ ప్రాంతానికి విస్తరిస్తున్నాం. పామాయిల్ సాగుతో రైతుకు నిరంతర ఆదాయం వస్తుంది. ఇప్పటికే మొక్కలు నాటిన రైతులకు రాయితీ వర్తిస్తున్నాయి. మొక్కలు కొన్న ప్రాంతం నుంచి రసీదు చూపించి రాయితీ పొందవచ్చు. ఆసక్తి గల రైతులకు ఎకరాకి రూ.40 వేల వరకు రాయితీ ఇస్తున్నాం.

సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉద్యాన వన శాఖాధికారి పార్వతీపురం మన్యం జిల్లా

పులి సంచారంపై అటవీ శాఖాధికారుల పరిశీలన



అటవీ ప్రాంతాల్లో పరిశీలించిన ఆ శాఖ అధికారులు

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురంలో శనివారం పులి సంచారంపై అప్రమత్తమైన అటవీ శాఖాధికారులు ఆదివారం కొండప్రాంతాలను పరిశీలించారు. అనంతగిరి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ దుర్గా ప్రసాద్, ఎఫ్‌బీఓలు రాంబాబు, ఎస్.రవికుమార్, ఏబీఓ రాజాబాబు తదితరులు బంగారయ్యపేట, ఎస్.కోట సీతారాంపురం గ్రామాలను ఆనుకుని ఉన్న కొండప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. తాటిపూడి వైపు నుంచి అదే దారిలో పులి తిరిగి వెళ్లినట్లు అటవీశాఖాధికారులు అనుమానం వ్యక్తం చేశారు. అయితే నిన్న అదృశ్యమైన ఆవుదూడ ఆచూకీ తెలియరాలేదని అధికారులు చెప్పారు. అనంతరం బంగారయ్యపేట, ఎస్.కోట సీతారాంపురం, పాతవూరు, కొండగంగుబూడి గ్రామాల్లో ప్రజలు పదిరోజుల పాటు అప్రమత్తం ఉండాలని, ఉదయం 9 గంటలవరకు బయటకు రావద్దని, సాయంత్రానికి ఇంటికి చేరుకోవాలని కోరారు. అలాగే వీలైనంతవరకు పశువులను అందుబాటులో ఉంచుకునేలా చూడాలని ప్రజలకు సూచించారు.

అందరి సహకారంతో అభివృద్ధి పథంలో డీసీఎంఎస్

- చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ భావన

విజయనగరం ఫోర్ట్: అందరిసహకారంతో డీసీఎంఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన తెలిపారు. ఈ మేరకు ఆమె అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.20.68 కోట్ల వ్యాపారం నిర్వహించి, రూ.26.24 లక్షల నికర లాభాన్ని ఆర్జించామని తెలిపారు. రాష్ట్రంలో రూ.20 కోట్లకు పైగా వ్యాపారం నిర్వహించే డీసీఎంఎస్‌లు అయిదు ఉండగా అందులో విజయనగరం ఉండడం సంతోషదాయకమన్నారు. ప్రజాప్రతినిధులు, డీసీఎంఎస్ డైరెక్టర్ల సహకారంతో డీసీఎంఎస్ అభివృద్ధి సాధ్యమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు వ్యాపారాన్ని మరింత పెంచేందుకు సభ్యుల సహకారంతో కృషి చేస్తున్నామని తెలిపారు. నిలిచిపోయిన విత్తనాలు, ఎరువుల విక్రయాలను పునరుద్ధరించి రైతులకు సరసమైన ధరకే విక్రయించి మేలు చేయగలుగుతున్నామన్నారు. డీసీఎంఎస్ కార్యాలయం వద్ద జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, మార్క్‌ఫెడ్ డీఎం విమల, బిజినెస్ మేనేజర్ సాయికుమార్, డైరెక్టర్లు పి.రామకృష్ణ, పి. నారాయణమూర్తి, వి.శ్రీరాములు నాయుడు, బి.బంగారు నాయుడు, ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి వ్యక్తి మృతి



నారాయణరావు మృతదేహం

సీతంపేట: కర్రల లోడ్‌తో కొత్తూరు నుంచి రాజాం వెళ్తున్న ట్రాక్టర్‌పై నుంచి జారిపడి రేగిడి ఆముదాలవలస మండలానికి వంజరాపు నారాయణరావు (65) మృతిచెందాడు. శనివారం రాత్రి ఈ దుర్ఘటన జరిగింది. ట్రాక్టర్ వెనుకభాగంలో కర్రలపై నారాయణ రావు కూర్చోవడంతో వాబ గ్రామ సమీపంలో జారిపడ్డాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

26న బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

బాడంగి: ఈనెల 26వ తేదీన బాడంగి మండలంలోని వాడాడలో అండర్ 14 జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపిక జరుగుతుందని గేమ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో చెప్పారు. రాష్ట్రస్థాయిలో నంద్యాలలో ఈనెల30నుంచి అక్టోబర్ 2వ తేదీవరకు జరగనున్న పోటీలకు ఇక్కడ ఎంపిక చేసిన జట్లను పంపించున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఉత్సాహవంతులైన క్రీడాకారులు అధికసంఖ్యలో పాల్గొని జిల్లాజట్ల ఎంపికకు తోడ్పడాలని కోరారు.

ఆకట్టుకున్న అన్నమాచార్య కీర్తనలు



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న శ్రీవారి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక వసంత విహార్‌లో శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భక్తి సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు సారథ్యంలో వర్ధమాన గాయనీ, గాయకులు అన్నమాచార్య కీర్తనలు ఆలపించి ప్రేక్షకులను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. అనంతరం అసోసియేషన్ నిర్వాహకుడు భీష్మారావును దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో 24 గంటలూ సేవలు

- డీఎంహెచ్‌ఓ జగన్నాథ రావు



డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్యసేవలు అందిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటి నుంచి పీహెచ్‌సీల్లో 24 గంటలూ సేవలందించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది తప్పనిసరిగా ఉండేలా సర్దుబాటు చర్యలు చేపట్టామని తెలిపారు. గతంలో ఎంపిక చేసిన కొన్ని పీహెచ్‌సీలు మాత్రమే 24 గంటలూ పని చేసేవని, ప్రస్తుతం జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో 24 గంటలు వైద్యసేవలు అందిస్తున్నాయని స్పష్టం చేశారు. పీహెచ్‌సీకి కేటాయించిన ఇద్దరు వైద్యుల్లో ఒకరు ఆస్పత్రిలో ఉంటే మరొకరు పల్లెల్లోని హెల్త్ క్లినిక్‌లకు 104 వాహనంతో వెళ్లి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి ఫాలోఅప్, పాఠశాల, అంగన్వాడీ బాలలకు వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 వరకు మూడు షిఫ్టుల్లో పీహెచ్‌సీలలో వైద్యసిబ్బంది పనిచేస్తున్నారని వివరించారు.

వాలీబాల్ చాంపియన్ షిప్‌కు రిఫరీ ఎంపిక



రిఫరీగా ఎంపికైన కుమార్

కొత్తవలస: ఈ నెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలోని స్టీల్‌ప్లాంట్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న వాలీబాల్ చాంపియన్‌షిప్‌కు రిఫరీగా కొత్తవలసకు చెందిన ఎల్‌జీఎస్ కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలీబాల్ అసోషియేషన్ కార్యదర్శి టీవీ.భగవాన్‌దాస్, విశాఖస్టీల్ ప్లాంట్ స్పోర్ట్స్ మేనేజర్ సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేశారు. కుమార్ ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ వాలీబాల్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కుమార్‌ను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశాఖ పోర్టు ట్రస్టు వాలీబాల్ చీఫ్‌కోచ్ గవర సూరిబాబు, జిల్లా కార్యదర్శి కేవీఎస్ రాజు, సహాయకార్యదర్శి కె.కృష్ణంరాజు అభినందించారు.

26న అండర్-19 తైక్వాండో జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 26న నిర్వహించనున్నట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ ఆదివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి 2005 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించి ప్రస్తుతం అభ్యసిస్తున్న 8,9,10, ఇంటర్‌మీడియట్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ ఆధార్, 10వ తరగతి సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, సంబంధిత విద్యాసంస్థ నుంచి స్టడీ సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లాస్థాయి ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో కడప జిల్లాలో జరగబోయే అంతర్‌జిల్లాల పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9885111375 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మన్యంలో పర్యాటకుల సందడి



జలవిహార్‌లో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో అడ్వెంచర్ పార్కు కళకళలాడింది. జలవిహార్‌లో పర్యాటకులు బోటు షికారు చేశారు. అలాగే వివిధ సాహస క్రీడల్లో పాల్గొన్నారు. మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.



క్లైంబింగ్ నెట్ ఎక్కుతున్న చిన్నారులు



బంజీట్రంపోలిన్ చేస్తున్న బాలుడు

కోచ్‌ను కలిసిన అంతర్జాతీయ క్రీడాకారిణి



కోచ్ శ్రీరాములును కలిసిన అంతర్జాతీయ క్రీడాకారిణి కనకల పైడిరాజు

శృంగవరపుకోట: ఈ నెల 19,20 తేదీల్లో శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 400 మీటర్ల పరుగుపందెంలో సిల్వర్ మెడల్ సాధించిన సాలూరు మండలం మామిడిపల్లికి చెందిన కనకల పైడిరాజు భర్తతో వచ్చి తన కోచ్ పాట్నూరు శ్రీరాములును ఆదివారం కలిసింది. ఈ సందర్భంగా ఆమె కోచ్ శ్రీరాములుతో మాట్లాడుతూ తాను ఈ స్థాయికి చేరుకోవడానికి కారణం మీరేనని, మీ ప్రోత్సాహంతోనే జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించానని చెబుతూ సంతోషం వెలిబుచ్చింది. ఈ సందర్భంగా భర్తతో కలిసి కోచ్ దగ్గర ఆశీస్సులు తీసుకుంది.

ఆకట్టుకున్న 'వందే గురజాడ కోకిలమ్'



చిరు ప్రసంగాలు చేసిన చిన్నారులను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురజాడ కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన వందే గురజాడ కోకిలమ్ సాహితీ సదస్సు ఆద్యంతం ఆహూతులను అలరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జన విజ్ఞాన వేదిక ప్రతినిధి డాక్టర్ ఎంవీఆర్. కృష్ణాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా గురజాడ రచనలపై గురజాడ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు చిరు ప్రసంగాలను ఇచ్చారు. కన్యాశుల్కంపై ఎస్.హన్సిక, ముత్యాల సరాలును డి.నాగమణి, కథానికను కె.లక్ష్మీశ్రీవాణిలు ఇచ్చిన అద్భుతమైన ప్రసంగాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థినులను సంస్థ నిర్వాహకులు సత్కరించారు. ప్రముఖ నటుడు, దర్శకుడు ఈపు విజయకుమార్ సదస్సుకు సభాధ్యక్షత వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు భోగరాజు బాబూజీ, కాపుగంటి ప్రకాశ్, దామరాజు శంకరం, డాక్టర్ జక్కు రామకృష్ణ, భోగరాజు సూర్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం, హరిచందన్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల అభివృద్ధికి రూ.4కోట్లు

- జిల్లాలో 8 పీహెచ్‌సీల్లో అదనపు గదుల ఏర్పాటుకు చర్యలు



రామభద్రపురం పీహెచ్‌సీ

రామభద్రపురం: జిల్లాలో తెర్లాం, రామభద్రపురం, దత్తిరాజేరు, వంగర, ఎల్.కోట, మెంటా డ, గంట్యాడ, పూసపాటిరేగ మండలాల్లోని పీహెచ్‌సీల అభివృద్ధి కోసం ప్రభుత్వం నాడు - నేడులో భాగంగా రూ.4కోట్లు మంజూరు చేసింది. ఒక్కో పీహెచ్‌సీకి రూ.50 లక్షల చొప్పున అంచనా విలువలతో నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆయా పీహెచ్‌సీల ఆవరణలో లేబొరేటరీ, వెయిటింగ్ రూం, మరుగుదొడ్లు స్టోర్ రూమ్, కంప్యూటర్ ఆపరే టర్ గదులు నిర్మించనున్నారు. టెండరు విధా నం ద్వారా కాంట్రాక్టర్లను నియమించారు. ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్ష ణలో ఈ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈఈ బీకేపీ రాజు తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణానికి రూ.9కోట్లతో ప్రతిపాదనలు

- పీఆర్ (ప్రాజెక్ట్స్) ఏఈ శంకరరావు

సీతానగరం: మండలంలోని బూర్జ వద్ద సువర్ణముఖి నదిపై వంతెన నిర్మాణానికి పంచాయతీరాజ్(ప్రాజెక్ట్స్) ఇంజినీరింగ్, ఆర్‌అండ్‌బీ అధికారులు తాజాగా స్థల పరిశీలన చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజ యం సాధించిన పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సువర్ణముఖి నదిపై దశాబ్దాలుగా నిలిచిపోయిన బగ్గందొరవలస - గెడ్డలుప్పి, బలిజిపేట మండలం నారాయణపురం వద్ద వంతెన నిర్మాణాల పూర్తికి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. బూర్జతో కలిపి మూడు వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని అప్పట్లో అభ్యర్థించారు. ఈ క్రమంలో అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెనల నిర్మాణాలకు ప్రభు త్వం నిధులు మంజూరు చేయడంతో నారాయణపురం, గెడ్డలుప్పి వంతెనల నిర్మాణం(అప్రోచ్ రోడ్డు మినహా) పూర్తయ్యాయి. మిగిలిన సువర్ణముఖి నదిపై బూర్జ నీలాటిరేవులో వంతెన నిర్మాణం కోసం రూ.9కోట్లతో పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల సూచనలు, పీఆర్ మంత్రిత్వ శాఖ సూచనల మేరకు ప్రభుత్వాని కి నిధుల మంజూరు నిమిత్తం ప్రతిపాదనలు పంపించామని పీఆర్ ప్రాజెక్ట్స్ ఏఈ జి.శంకరరావు తెలిపారు. నిధులు విడుదలైతే వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.